

'పది' పరీక్షలకు ఇలా సిద్ధం కావాలి

• నిపుణుల సూచనలు-సలహాలు

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్



ఈనెల 17 నుండి 31 వరకు పదోతరగతి పరీక్షలు జరగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా 517 పాఠశాలల నుండి విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. పరీక్షల నిర్వహణకు 172 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో జిల్లా వ్యాప్తంగా 40,776 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఇందులో 31,410 రెగ్యులర్, ప్రయివేటు 7038, ఓపెన్ టెన్త్ 2328 విద్యార్థులు రాయనున్నారు. పరీక్షలు రాస్తున్న విద్యార్థులు గమనించాల్సిన అత్యంత ముఖ్యమైన విషయాలు గమనించాల్సిన అవసరముంది. పాఠశాలలో ఇదివరకు ఎలాగ పరీక్షలు రాశారో పబ్లిక్ పరీక్షలు అలానే అని గమనించాలి. రాసే ప్రదేశం మాత్రమే మారుతుంది. ఏ సబ్జెక్టు గూర్చి భయపడాల్సిన పని లేదు. ఇంతవరకు ఏమి నేర్చుకున్నారో అవే ప్రశ్నలుగా వస్తాయని మాత్రం మరచిపోవద్దు. భయం అనేది వుండకూడదు. చేతిరాత బాగా ఉండాలి. అది తెలుగు, హిందీ, ఇంగ్లీష్, కన్నడ ఏ సబ్జెక్టయినా అందమైన చేతిరాత తలరాతను మారుస్తుంది. పరీక్ష హాల్లో 3 గంటల 15 నిమిషాలు ఉంటారు. 15 నిమిషాలు సంతకాలు, హాల్‌టికెట్ పరిశీలన ఇవన్నీ పూర్తయితే 3 గంటలపాటు పరీక్ష రాస్తారు. ఆ మూడు గంటలపాటు ఎటువంటి వత్తిడి, ఆందోళన పడకుండా ఏ ఇతర విషయాల మీద విద్యార్థులు ధ్యాస పెట్టకుండా ఉంటే నూటికి నూరు మార్కులు సంపాదించవచ్చు. ఈనేపథ్యంలో పరీక్షరాసే వారికోసం నిపుణుల అభిప్రాయాలతో ప్రజాశక్తి ప్రత్యేక కథనం...



తెలుగు : తెలుగులో వ్యాకరణాంశాలు భయపడతారు. ఇప్పుడు చదివి కూడా ప్రాక్టీస్ చేయవచ్చు. ఉపవాచకం రామాయణంలో కాండలు గుర్తించే సమయంలో కన్ఫ్యూజ్ అయ్యే అవకాశం వుంది. అవి మరొక్కసారి చదివి పరీక్షకు వెళ్లండి. చందస్సు ఒకసారి ప్రాక్టీస్ చేయండి. జాతీయాలు ఉపయోగించే సందర్భం, వాక్యాలను గుర్తించడం, ఆధునిక వచనంలోకి మార్చు చేసేటప్పుడు జాగ్రత్తగా ఫైనల్ ప్రాక్టీస్ చేయాలి.

- కె.తాయప్ప ఎస్ఎ తెలుగు, జడ్‌పి హైస్కూల్, తొగర్చేడు, కృష్ణగిరి మండలం.



హిందీ: వ్యాకరణాంశాలు ఉదాహరణలతో ప్రాక్టీస్ చేయండి. షార్ట్ క్వశ్చన్స్ చదవండి. ప్రశ్న నెంబర్ 30 నిబంధ్‌కు సంబంధించి చదవండి. పారాగ్రాఫ్ ప్రశ్నలు ప్రాక్టీస్ చేయండి.

- ఖాజాబేగ్ ఎస్ఎ, హిందీ, జెడ్పీ ఉన్నత పాఠశాల బోయినపల్లి, వెల్దుర్తి మండలం



గణితం: ట్రయాంగిల్స్ సర్ఫేస్ ఏరియాస్ అండ్ వాల్యూమ్స్, సర్కిల్స్, త్రికోణమితి అధ్యాయాలలోని లెక్కలు చేయటంలో ఇబ్బంది పడుతుంటారు. వీటిని అధిగమించటానికి ముఖ్యంగా భావనలు బాగా అర్థం చేసుకోవటం, సమస్యను రెండు మూడు సార్లు చదవటం, సూత్రాలను నిర్వచనాలను బాగా నేర్చుకొని అవసరమైనచో వినియోగించటం చేయాలి. ముఖ్యంగా జామెట్రీలో పూర్వాభావనల అవగాహన కలిగివుండటం ముఖ్యం.

- ఎస్.రాజశేఖర్ రెడ్డి ఎస్ఎ మ్యాథ్స్, జడ్‌పి ఉన్నత పాఠశాల పుల్లగుమ్మి, వెల్దుర్తి మండలం



English: 1. Q.No. 35(A) conversation. It needs a lot of practice.Focus on sentence formation

2.Q.No. 36 (A) Letter writing It is very easy to score 10 marks. Focus more on 2 letter formats - formal and Informal

3.Question No.37(A)Framing wh questions Focus on Tense to frame wh questions.

4 . Q.No. 37 (B) Information Transfer

Understand tree diagram, bar diagram and pie chart first and transfer the Information into a meaningful paragraph.

-G.VijayaKumar SA English ZPHS Peddkadabur



జీవశాస్త్రం: జెనెటిక్స్ మెండల్స్ చట్టంలో, పిల్లల లింగ నిర్ధారణ జన్యువులతో వస్తుంది. అర్థం చేసుకోవడానికి సంతాన స్వభావం, ల్యాబ్ కార్యకలాపాలు, కార్బన్‌డయాక్సైడ్, నీరు, క్లోరోఫిల్ ప్రాముఖ్యతను రేఖాచిత్రాలతో గ్రహించడం ఫైనల్‌గా చదవాలి.

-ఎస్.షేక్షావలి, ఎస్ఏ (బయాలజీ), జెడ్పీ ఉన్నత పాఠశాల, అముకతాడు, కృష్ణగిరి మండలం



భౌతికశాస్త్రం: బొమ్మలు ప్రాక్టీస్ చేయాలి. ముఖ్యమైన పదిప్రశ్నలు ఇదివరకే ఇచ్చిన మోడల్ పేపర్ ప్రశ్నలు ప్రాక్టీస్ చేస్తే భయపడవల్సిన పనిలేదు. కార్బన్, సమ్మేళనాలు పరీక్ష ముందు రోజు ఒక సారి బాగా చదవండి. తుల్యరసాయన సమీకరణాలు ప్రాక్టీస్ చేయాలి.

- ఆదిమూర్తి (భౌతిక శాస్త్రం), జెడ్పీ ఉన్నత పాఠశాల, విరుపాపురం, ఆదోని మండలం



సాంఘికశాస్త్రం: చరిత్ర అంశాలు కొంచెం కష్టం అనిపిస్తాయి కానీ మీరు అవగాహనతో సొంత వాక్యాలలో రాయగలిగితే చాలా సులభం. మ్యాప్ పాయింటింగ్ పాత ప్రశ్నపత్రాలు ఓ అయిదింటిని ప్రాక్టీస్ చేయాలి. ఒక్క మార్కులు ప్రశ్నలు ఎస్‌సిఇఆర్‌టి వారు మోడల్ ఇచ్చారు. వాటిని చదవండి. పెద్ద ప్రశ్నల్లో ఏ ప్రశ్న వదలవద్దు. తరగతి గదిలో ఆ ప్రశ్నకు సంబంధించి విన్న విషయాలు సొంతంగా రాయాలి.

-పి.మారుతి పౌరోహితం, ప్రధానోపాధ్యాయులు, జెడ్పీహైస్కూల్ ప్యాలకుర్తి



ఐదు తప్పులు చేయొద్దు

పరీక్షల్లో సాధారణంగా విద్యార్థులు చేసే ఐదు తప్పులు అక్షర దోషాలు రాయడం, కొట్టివేతలు రాయడం, గణితం, సైన్స్‌లో పార్ములాలు తప్పు రాయడం, ప్రశ్నలకు రిలేటెడ్‌గా జవాబు రాయకపోవడం, గుర్తొచ్చినదే జవాబుగా రాయడం, క్వశ్చన్ నెంబర్ సరిగ్గా వేయకపోవడం, వేయకుండా జవాబు రాయడం వంటి ఐదు తప్పులు చేయకపోతే విద్యార్థులు పరీక్షలు బాగా రాసినట్లే...

- ఎస్.శ్యామ్యూల్ పాల్, జిల్లా విద్యాధికారి కర్నూలు

ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలి

- సమీక్షలో ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతి లాల్ దండే

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని జిల్లా ఇన్‌ఛార్జి ఆఫీసర్, రహదారులు, భవనాలు, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతి లాల్ దండే ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శనివారం నగరంలోని కొండారెడ్డి బురుజు ఎదురుగా ఉన్న ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం గురించి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కాంతిలాల్ దండే, కలెక్టర్ పి.రంజిత్ బాషా, జెసి డాక్టర్ బి.నవ్య, ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి పాల్గొన్నారు. కాంతిలాల్ దండే మాట్లాడుతూ 30 ఏళ్ల కిందట మన ఇంటికి పెద్దవారు వచ్చినప్పుడు గొడుగు, చేతి సంచి, ఇత్తడి మరచెంబుతో వచ్చేవారన్నారు. ప్రస్తుత కాలంలో అవన్నీ వెళ్లిపోయి, వాటి స్థానంలో ప్లాస్టిక్ ఆక్రమించి, ప్లాస్టిక్ సంచులు , ప్లాస్టిక్ నీటి బాటిళు వచ్చాయన్నారు. ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను ఆయన వివరిస్తూ, ప్లాస్టిక్ కొన్ని వందల సంవత్సరాల తరువాత కూడా నిర్వీర్యం కాకుండా అలాగే ఉండిపోతుందన్నారు. అందువల్ల ప్లాస్టిక్ అవశేషాలు మనం తినే అన్ని రకాల ఆహార పదార్థాలలో చేరి, చాలా రకాల జబ్బులు వస్తున్నాయని తెలిపారు. ప్లాస్టిక్‌ను మన దైనందిన జీవితం నుండి నిషేధించుకోవాలని కోరారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని పూర్తిగా మానేయాలన్నారు. ప్లాస్టిక్‌ను భూమిపై పడవేయకుండా తిరిగి ఉపయోగించుకునే విధంగా చర్యలు కూడా చేపట్టాలన్నారు. మార్కెట్ కు వెళ్తున్నప్పుడు చేతి సంచిని తీసుకొని వెళ్లాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా మూడవ శనివారం ఒక్కో అంశంతో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ఇందులో భాగంగా ఈ రోజు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నివారించండి - పునర్వినియోగాన్ని ప్రోత్సహించండి అన్న అంశంతో స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాలు, వార్డుల్లో నిర్వహించుకుంటున్నామని తెలిపారు. ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి, జీవరాశులకు, ఆరోగ్యానికి చాలా నష్టం కలుగుతుందన్నారు. ప్లాస్టిక్ దుష్ప్రభావం సముద్ర జలాలను కూడా ప్రభావితం చేస్తోందని, ప్లాస్టిక్ వల్ల నేల, నీరు కలుషితం అవుతున్నాయని తెలిపారు. ప్లాస్టిక్ దుష్ప్రభావాలు ఆహారంపై కూడా పడడం వల్ల క్యాన్సర్ లాంటి జబ్బులు వస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించి, పర్యావరణాన్ని కాపాడడం మన బాధ్యత అని కలెక్టర్ ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం ప్రిన్సిపల్ సెక్రటరీ, కలెక్టర్ పి.రంజిత్‌బాషా సమావేశంలో పాల్గొన్న ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించి, కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ప్లాస్టిక్ ఫ్రీ భోజన ప్లేట్లు, నేలను శుభ్రం చేసే ప్లాస్టిక్ ఫ్రీ మ్యాట్లు తదితర వస్తువుల ప్రదర్శనను తిలకించారు. తదుపరి ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంలో మొక్కలు నాటి, కొండా రెడ్డి బురుజు దగ్గర స్వచ్ఛతా కార్యక్రమంలో పాల్గొని రోడ్లను శుభ్రపరిచారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, రోడ్లు భవనాల శాఖ ఎస్‌ఇ మహేశ్వర రెడ్డి, ఇఇ సురేష్, డిటిసి శాంతకుమారి, ఆర్‌టిఒ భరత్ చౌహాన్, హెల్త్ ఆఫీసర్ విశ్వేశ్వర రెడ్డి, కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్ ,పత్తికొండ ఆర్‌డిఒ భరత్ నాయక్ పాల్గొన్నారు.



గోడపత్రికను విడుదల చేస్తున్న కాంతిలాల్‌దండే, కలెక్టర్ రంజిత్‌బాషా

ఎపిపిఎస్‌సి పరీక్షకు పకడ్బంధీ ఏర్పాట్లు

- జెసి డాక్టర్ బి.నవ్య

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఆది, సోమవారాల్లో జరిగే ఎపిపిఎస్‌సి పరీక్షల నిర్వహణకు పగడ్బంధీ ఏర్పాట్లు చేయాలని జెసి డాక్టర్ బి.నవ్య అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జెసి డాక్టర్ బి.నవ్య సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ... ఫారెస్టు రేంజ్ అధికారి పరీక్షకు 1250 మంది హాజరు కానున్నారని, సోమవారం నిర్వహించే ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ లో ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్లకు 393 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఉదయం 8 నుండి 9 గంటల వరకు మాత్రమే (గ్రేస్ పీరియడ్‌తో కలిపి) పరీక్షా కేంద్రాలకు అనుమతిస్తారని చెప్పారు. అభ్యర్థులు తమ వెంట హాల్ టికెట్ తో పాటు ఏదైనా ఒక గుర్తింపు కార్డు తీసుకురావాలని పేర్కొన్నారు. ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీలో జూనియర్ అసిస్టెంట్ల ఉద్యోగుల కొరకు కర్నూలులోని నంద్యాల చెక్‌పోస్టు దగ్గర గల అయాన్ డిజిటల్ ఇనిస్టిట్యూట్ లో పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం 9.30 నుండి 12 గంటల వరకు ఉంటుందని, మధ్యాహ్నం 2.30 గంటల నుండి 5 గంటల వరకు ఉంటుందని ఎపిపిఎస్‌సి అసిస్టెంట్ సెక్రటరీ వెంకట్రావు వివరించారు. మధ్యాహ్నం పరీక్షకు 1.00 గంట నుంచి 2 గంటల వరకు మాత్రమే (గ్రేస్ పిరియడ్ తో కలిపి) పరీక్షా కేంద్రంలో అనుమతిస్తారని వివరించారు. మొబైల్ ఫోన్లు ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరాదని, ఇన్విజిలేటర్లు వద్ద కూడా మొబైల్ వుండరాదని చెప్పారు. ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించబడవని తెలిపారు. డిఆర్‌ఒ సి.వెంకట నారాయణమ్మ, ఎపిపిఎస్‌సి అసిస్టెంట్ సెక్రటరీ ఎన్ వెంకట్రావు, సెక్షన్ ఆఫీసర్ ఆర్‌వి రమణ, పాల్గొన్నారు.



మిరప రైతు కన్నీరు..!

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

గత రెండేళ్ల క్రితం మిరప పంటకు మంచి ధర పలకడంతో రైతులందరూ అధిక శాతం మిరప పంటను సాగు చేస్తున్నారు. దిగుబడులు ఓ మోస్తరుగా వచ్చినా ధరలు క్షీణిస్తుండడంతో రైతులు అయోమయ స్థితిలో పడ్డారు. మిరప పంటకు ధర వస్తుందన్న ఆశతో ఈ ఏడాది కూడా రైతులందరూ మిరప పంటను సాగు చేశారు. ఒక ఎకరా మిరప సాగు చేసేందుకు దాదాపు రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడి వస్తుందని రైతులు తెలుపుతున్నారు. వ్యవసాయ అధికారులు సూచనలు ఎంత ఆచరించినప్పటికీ మిరప పంటలో తెగుళ్ల వస్తూనే ఉంటాయని, వారానికోసారి తప్పనిసరిగా నీళ్ల మందులు స్ప్రే చేస్తూనే ఉండాలని రైతులు చెబుతున్నారు. ఒక నెలలో మూడు సార్లు నీటి తడులు కట్టాల్సి వస్తుంది. మిరపకాయలు తెంచే కూలిలే దాదాపు రూ.లక్ష వరకు వస్తుందని, వారికి కూడా అప్పులు చేసి చెల్లిస్తున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. వర్షాలు తక్కువగా కురవడంతో ఏడాదిగా నీటి తడులు కట్టుకోవడానికి రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు. పొలాలు లేని రైతులు కూడా మిరప ధర చూసి కౌలుకు తీసుకొని రూ.లక్షలకు లక్షలు అప్పులు చేసి మిరప పంటలు సాగు చేశారు. ధరలు చూస్తే రోజురోజుకు పతనం అవుతుండడంతో కౌలు రైతులకు కంట్లో కన్నీరే మిగిలిన పరిస్థితి దాపురించింది. కొద్ది వరకైనా అమ్ముకుందామని వెళితే మార్కెట్‌లో మిరప ధర పూర్తిగా క్షీణిస్తోంది. తీసుకెళ్లి గిడ్డంగుల భవనాల్లో భద్రపరుస్తున్నారు. ఆ భవనంలో పెట్టేందుకు కూడా దాదాపు రెండు, మూడు రోజులు ఆలస్యం అవుతుందని, రసీదులు తీసుకెళ్తే కూడా భవనాల యజమానులు కిరికిరి చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి మిరప రైతులకు గిట్టుబాటు ధర కల్పించాల్సిన అవసరం ఉంది.

అంగన్వాడీలపై నిర్బంధం : తమ హక్కుల సాధన కోసం చలో విజయవాడకు వెళ్తున్న అంగన్వాడీలను అడ్డుకునేందుకు అధికారులు తీవ్ర ప్రయత్నం చేశారు. అంగన్వాడీలకు అడుగడుగునా అధికారులు ఆటంకాలు కలిగించారు. జిల్లాలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి సిడిపిఒలకు ఫోన్‌లు చేసి అంగన్వాడీలు చలో విజయవాడకు వెళ్లడానికి వీలు లేదంటూ హుకుం జారీ చేశారు. సిడిపిఒలు, సూపర్ వైజర్ల ద్వారా అంగన్వాడీలపై విజయవాడకు వెళ్లొద్దని ఒత్తిడి పెంచారు. మొన్ననే అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పెద్దలు, అధికారులు వేదికలపైన మహిళల సంక్షేమం, వారి అభివృద్ధి కోసం ఉన్నాం.. మహిళా సాధికారత సాధించడమే లక్ష్యంగా ఉన్నామని ప్రకటించారు. ఆచరణలో మహిళల హక్కులను అణగదొక్కారు. తమ సమస్యలు ప్రభుత్వానికి చెప్పుకోవడానికి వెళ్తున్న అంగన్వాడీలకు, విజయవాడకు వెళ్లొద్దంటూ ఫోన్‌లు చేసి, గ్రూపుల్లో మెసేజ్‌లు పెడుతూ అంగన్వాడీలను భయభ్రాంతులకు గురి చేశారు. ఎన్ని ఆటంకాలు కల్పించినా తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు అంగన్వాడీలు విజయవాడ వెళ్లి తీరారు.

మండుతున్న ఎండ : ఫిబ్రవరి రెండో వారంలోనే భానుడి భగభగలు మొదలై ప్రస్తుతం ఎండ తీవ్రత పెరిగింది. గత వారం రోజుల నుంచి ఎండ తీవ్రరూపం దాల్చింది. పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. కర్నూలు జిల్లాలో గతేడాది ఇదే సమయానికి పగటి పూట అత్యధికంగా 38 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కాగా ప్రస్తుతం 39 డిగ్రీలకు చేరుకుంది. కర్నూలు నగరంలో బుధవారం అత్యధికంగా 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లా వ్యాప్తంగానూ అదే స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధిక ఉష్ణోగ్రత వల్ల ఎండ సెగ తీవ్ర స్థాయిలో కనిపించింది. ఎండ ధాటికి తట్టుకోలేక నగరంలో మధ్యాహ్నం పూట రోడ్ల మీద జన సంచారం పలుచబడింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ రోడ్ల మీద జనం చాలా తక్కువగా కనిపించారు. అత్యవసర పనుల విషయంలో మినహాయించి మిగతా సందర్భాల్లో రోడ్ల మీదకు వచ్చేందుకు జనం జంకే పరిస్థితి ఏర్పడింది.



అవీ..ఇవీ..అన్నీ..

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కర్నూలు కలెక్టరేట్ ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో మహా ధర్నా చేపట్టారు. లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో హాజరై ఇళ్ల స్థలాలు ఇవ్వాలని నినదించారు. జిల్లా వ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి పూలే 128వ వర్ధంతిని సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు అందించాలని వైసిపి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో యువత పోరు కార్యక్రమం నిర్వహించారు. కష్టపడి, ఎర్రని ఎండకు కష్టం చేసిన ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని, పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సచివాలయాల ఎదుట ఆందోళనలు చేపట్టారు.



కలెక్టరేట్ ఎఒకు వినతిపత్రం ఇస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

సంజన్నమృతదేహానికి పోస్టుమార్టం

కుటుంబానికి నంద్యాల ఎంపీ, పాణ్యం ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

టిడిపి నేత సంజన్న మృత దేహానికి శనివారం కర్నూలు జిల్లా ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. సంజన్న హత్య ఘటన గురించి తెలుసుకున్న టిడిపి నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, టిడిపి నాయకులు బైరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, పాణ్యం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి గౌరు వెంకటరెడ్డి శనివారం ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా మతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. సంజన్న మరణం పార్టీకి తీరని లోటని అన్నారు. హత్య చేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లో వదలబోమని వారికి తగిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. కుటుంబానికి అండదండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సంజన్న మతదేహానికి మధ్యాహ్నం పోస్టుమార్టం పూర్తి చేసి మతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మతదేహాన్ని ఇంటికి తరలిస్తుండగా ఎమ్మార్పీఎస్ నాయకులు హత్య చేసిన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మృతదేహంతో కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నాకు పూనుకున్నారు. కలెక్టరేట్ ఎఒ వచ్చి నిందితులను అరెస్టు చేయించి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో శాంతించారు. అనంతరం మృతదేహాన్ని షరీన్ నగర్ లోని స్వగృహానికి తరలించి అక్కడి నుంచి కృష్ణానగర్ సమీపంలోని హంద్రీ నదిఒడ్డున్న స్మశాన వాటికలో ఖననం చేశారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి:ఆర్‌విఎస్

ప్రజాశక్తి-సి బెళగల్ : కోడుమూరు పట్టణంలో ఈ నెల 22 న నిర్వహించే రజకుల జిల్లా మహా సభలను జయప్రదం చేయాలనీ రజకుల వత్తి దారులు సంఘం జిల్లా కార్యదర్శి గురు శేఖర్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో జిల్లా నాయకులు బాలచంద్రుడు, మల్లికార్జునల సమక్షంలో మండల నాయకుల, కార్యకర్తల చేత కరపత్రాలను విడుదల చేశారు. గురు శేఖర్ మాట్లాడుతూ స్వాతంత్రం నేటికీ రజకులను ఆర్థికంగా, రాజకీయంగా అణచివేస్తున్నారన్నారు. వత్తి లేక వలసలు వెళ్తున్నారని ఒక వేళ వత్తి ఉన్నా 50 ఏళ్లకే వయసు భారంగా మారుతుందన్నారు. 22 న మహా సభలకు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. మద్దిలేటి, వీరేష్, వెంకటేష్, మల్లెన్న, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిద్దాం

జిల్లా ఇన్చార్జి ఆఫీసర్, కాంతిలాల్ దండే

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిద్దామని జిల్లా ఇన్‌ఛార్జి ఆఫీసర్, రహదారులు, భవనాలు, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కాంతిలాల్ దండే పేర్కొన్నారు. జిల్లా ఇన్‌ఛార్జి అధికారిగా నియమితులైన రహదారులు, భవనాలు, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కాంతిలాల్ దండే శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలో చేపడుతున్న ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాల అమలుపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. వ్యవసాయం, డ్వామా, డిఆర్‌డిఏ జలవనరులు, వైద్యారోగ్యం, విద్యా శాఖలకు సంబంధించిన కార్యక్రమాల అమలు గురించి ఆయా శాఖల జిల్లా అధికారులు ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలుసుకున్నారు. జిల్లా ఇన్‌చార్జి అధికారి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు డిస్ట్రిక్ట్ ఇన్‌ఛార్జి ఆఫీసర్లు, జోనల్ ఇన్‌ఛార్జి ఆఫీసర్లుగా నియమించారన్నారు. జిల్లాను ప్రగతి పథంలో నడిపించడానికి వీలుగా జిల్లా కలెక్టర్‌కు తగిన సహకారం, మార్గదర్శకత్వం అందించేందుకు ప్రభుత్వం ఈ వ్యవస్థ ను ఏర్పాటు చేసిందన్నారు. నిన్ననే జిల్లా అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలు, వనరుల సమీకరణ అంశాలపై జిల్లా కలెక్టర్ తో చర్చించామన్నారు. జిల్లాలో పేదరిక నిర్మూలన, ఎంఎస్‌ఎంఇల ఏర్పాటు, విద్య, వైద్య రంగాల అభివృద్ధి, నీటి వనరుల వినియోగం తదితర అంశాలపై దృష్టి సారిస్తామని తెలిపారు. ఆ దిశగా అధికారులు పని చేయాలని జిల్లా ఇన్చార్జి అధికారి ఆదేశించారు..

జిల్లా కలెక్టర్ కు అభినందన

విద్యా శాఖకు సంబంధించి వర్చువల్ తరగతుల నిర్వహణ ద్వారా ఉత్తమ ఉపాధ్యాయులతో 500 పాఠశాలల విద్యార్థులకు విద్యా బోధన అందిస్తూ, పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను అధిగమించడంపై జిల్లా కలెక్టర్ తీసుకున్న ప్రత్యేక చొరవను ప్రిన్సిపల్ సెక్రటరీ అభినందించారు. టెక్నాలజీ అమలులో జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ముందుంటారని, గతంలో కడపలో పని చేసే సమయంలో భూ రికార్డుల కంప్యూటరీకరణ లో వారి పాత్ర ప్రశంసనీయమని ప్రిన్సిపల్ సెక్రటరీ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ జిల్లాలో అమలు చేస్తున్న కార్యక్రమాల పురోగతి, జిల్లా అభివృద్ధిపై జిల్లా ఇన్చార్జి అధికారి ప్రతి 15 రోజులకు ఒకసారి లోతుగా సమీక్షిస్తారని కలెక్టర్ పేర్కొన్నారు. అందువల్ల అన్ని శాఖల అధికారులు, ఆయా శాఖల కార్యక్రమాల అమలులో పురోగతి చూపించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో అమలవుతున్న కార్యక్రమాల గురించి కలెక్టర్ ప్రిన్సిపల్ సెక్రటరీకి వివరించారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లాకళ్యాణి, డిఆర్‌ఒ వెంకటనారాయణమ్మ, సిపిఒ హిమ ప్రభాకర్‌రాజు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కాంతిలాల్ దండే

22 నుంచి 28 వరకు భగత్ సింగ్ వర్ధంతి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : ఈనెల 22 నుంచి 28 వరకు భగత్ సింగ్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై .నాగేష్ కోరారు. శనివారం డివైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ మాట్లాడుతూ మార్చి 22 నుంచి 28 వరకు భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా సభలు, సమావేశాలు, కాగడాల ప్రదర్శనలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అతిచిన్న వయసులోనే పెళ్లి భారతదేశానికి బ్రిటిష్ వలస పాలన నుండి విముక్తి చేయడానికి నవ్వుతూ ఉరికంభమెక్కిన విప్లవవీరులు భగత్ సింగ్ రాజ్‌గురు సుఖదేవ్ అని కొనియాడారు. భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత సోషలిస్ట్ ప్రభుత్వం ద్వారా మాత్రమే అభివృద్ధి చెందుతుందని నమ్మినావారని తెలిపారు. ప్రస్తుతం భారతదేశాన్ని నిరుద్యోగం డ్రగ్స్ పేదరికం పట్టి పీడిస్తుందని తెలిపారు. భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాడి యువతీ, యువకులందరూ నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా రాష్ట్రంలో ఖాళీ పోస్టుల భర్తీకి ప్రతి సంవత్సరం జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, మెగా డిఎస్‌సి విడుదల చేస్తామని ముఖ్యమంత్రి మొదటి సంతకం పెట్టారు ఇప్పటిదాకా మొదటి సంతకానికి మోక్షం కాలేదని తెలిపారు. గ్రూప్ 2, నిరుద్యోగ భృతి, 20 లక్షల ఉద్యోగాల కల్పన కోసం ప్రభుత్వంపై యువత పోరాడి సాధించుకోవాలన్నారు. రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన కర్నూలు జిల్లాలో నిరుద్యోగం వలసలు పేదరికం విలయతాండం చేస్తుందని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాలు యువతకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. భగత్ సింగ్, రాజ్‌గురు సుఖదేవ్‌ల వారసత్వాన్ని కాపాడు కోవడానికి పెట్రేగిపోయిన మతోన్మాదానికి వ్యతిరేకంగా నిరుద్యోగానికి వ్యతిరేకంగా పోరాటం చేయా లన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు కె.సురేష్ కుమార్, వీరేష్, జిల్లా సహాయ కార్యదర్శి హుస్సేన్ బాషా, అబ్దుల్లా, జిల్లా కమిటీ సభ్యులు, ప్రకాష్, శ్రీనివాసులు, మహేష్ ,వెంకటేష్, శిరీష పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నగేష్



మత్స్యశాఖ కమిషనర్ రామ్‌శంకర్‌నాయక్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

మత్స్యకారుల అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్


మత్స్యకారుల అభివృద్ధికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆ శాఖ కమిషనర్ రామ్ శంకర్ నాయక్ అన్నారు. శనివారం కర్నూలుకు వచ్చిన ఆయన మస్య మత్స్యశాఖ అధికారులతో జిల్లా మత్స్యశాఖ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలోని మత్స్యకారుల సమస్యలను వివరంగా అడిగి తెలుసుకున్నారు. మత్స్యకారులకు మెరుగైన సేవలు అందించేందుకు తీసుకోవలసిన చర్యలపై సూచనలు అందించారు. అనంతరం మత్స్య శిక్షణ కేంద్రాన్ని సందర్శించి, ట్రైనింగ్ పొందుతున్న విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా, మత్స్యరంగంలో ఉన్న విస్తృత అవకాశాలను గురించి వివరించి, యువత వాటిని సద్వినియోగం చేసుకొని అభివద్ధి చెందాలని సూచించారు. జిల్లా మత్స్య సహకార సంఘం గౌరవ సలహాదారు శ్రీనివాసులు, వైస్ చైర్మన్ పెద్ద వీరేశ్, డైరెక్టర్లు పోతుల శేఖర్, మద్దిలేటి, మల్లీశ్వరుడు, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ శ్యామలమ్మ, ఎఫ్‌డిఒలు మద్దిలేటి, స్వర్ణలత, విఎఫ్‌ఎ మంజుల పాల్గొన్నారు.


తాజ్ దర్బార్ లో రంజాన్ స్పెషల్ ఐటమ్స్

-సహెరి , 11 రకాల ఐటమ్స్‌తో రూ.250కి ఇఫ్తార్ బాక్స్

-రెస్టారెంట్ యజమాని అవీజ్

ప్రజాశక్తి -కర్నూలు కార్పొరేషన్





రంజాన్ నెలలో హలీం ఎంతో ప్రత్యేకమైన వంటకం. ఉపవాసం (రోజా) చేసిన తర్వాత ఇఫ్తార్ సమయానికి హలీం తినడం చాలా మందికి అలవాటుగా మారింది. రంజాన్ సందర్భంగా కర్నూలు ఆనంద్ థియేటర్ వద్దగల తాజ్ దర్బార్ రెస్టారెంట్ యజమాని అవీజ్ ప్రజాశక్తితో తెలిపారు. అయన మాటల్లో.... రంజాన్ నెలలో ప్రత్యేక వంటకాలతో నిర్వహిస్తున్నామని , ఇఫ్తార్ బాక్స్ పేరుతో నగర ప్రజలకు ఇఫ్తార్ బాక్స్‌లో మటన్ హలీం, మలయ్‌బన్, సమోసా లేదా దహి వడ, డ్రైఫ్రూట్స్, హైదరాబాది దాల్, ఖాజుర్, 4ఫ్రెష్ ఫ్రూట్స్, ఫ్రెష్ డ్రింక్ 400 ఎంఎల్ ఇలా 11 రకాల ఐటమ్స్ రూ.250 అందిస్తున్నామన్నారు. ఉపవాసనికి ముందు తీసుకునే సహెరి రూ.150కె కిచిడి కట్ట , ఖీమా మటన్ , చికెన్ సలాన్‌లను రూ.180 , రూ.120 రెండు తందూరి రొటీ, మటన్‌కా సలన్ లేదా చికెన్ కాసలన్ లేదా దాల్‌తడ్కా రూ.200, రూ.150,రూ100 ప్రత్యేకంగా అందిస్తున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

గత ఐదేళ్లలో అభివృద్ధి శూన్యం

- కూటమి అధికారంలోకి వచ్చాక అభివృద్ధి
- కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు
- ఎమ్మిగనూరులో స్కానింగ్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

గత ఐదేళ్ల వైసిపి పాలనలో కర్నూలు జిల్లా ఏ మాత్రమూ అభివృద్ధికి నోచుకోలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 8 నెలల్లోనే అభివృద్ధిలో దూసుకుపోతుందని ఎంపీ బస్తిపాటి నాగరాజు తెలిపారు. శనివారం ఎమ్మిగనూరులో ప్రయివేట్ స్కానింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కరువు, వలసలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన కర్నూలు జిల్లాను పారిశ్రామికంగా, ఇరిగేషన్ పరంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. పత్తికొండలో టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు శంకుస్థాపన చేసి 20 ఏళ్ల కలను సాకారం చేశామని చెప్పారు. ఓర్వకల్లులో రూ.14 వేల కోట్లతో సెమీ కండక్టర్ ఏర్పాటుకు చర్చలు జరుగుతున్నాయని, సెమీ కండక్టర్ ఏర్పాటయితే జిల్లా వాసులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. ఇక ఆర్‌డిఎస్, గుండ్రేవుల, వేదవతి ప్రాజెక్టులను పూర్తి చేసి జిల్లాలో కరువు, వలసలను నివారిస్తామని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, మల్లెల గ్రూపు అధినేత మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు, బీరప్ప, టీచర్ నాగన్న, డాక్టర్ మల్లికార్జున, రేడియాలజిస్ట్ వెన్నెల, బోడబండ నరసింహులు, మల్కాపురం రంగస్వామి పాల్గొన్నారు.

మెరుగైన వైద్యమందించడమే ధ్యేయం

- టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని



బాధితులకు చెక్కులు అందజేస్తున్న మీనాక్షి నాయుడు

పేదలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు తెలిపారు. శనివారం ఆయన నివాసంలో బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని 25 మందికి రూ.17,67,106 విలువైన సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందించామన్నారు. మెరుగైన వైద్య అవసరాలకు పేదరికం అడ్డు కాకూడదన్న ఆశయంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సిఎంఆర్ఎఫ్ నిధుల ద్వారా వేలాది కుటుంబాలను ఆదుకుంటున్నారని తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణే కూటమి ప్రభుత్వ తొలి ప్రాధాన్యత అని, అనారోగ్యం బారిన పడి ఆర్థికంగా చితికిపోయి కష్టాల్లో ఉన్న కుటుంబాలకు సిఎంఆర్ఎఫ్ సహాయం కొండంత అండ నిలుస్తుందని చెప్పారు. బసాపురం రామస్వామి, టిడిపి 1వ వార్డు ఇన్‌ఛార్జీ వాల్మీకి వెంకటేష్ ఉన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని 16 గ్రామాల్లో ప్రజలు వలసలు వెళ్లకుండా ఉపాధి పనులు కల్పించాలని, అందుకు తగ్గట్టుగానే విధుల్లో కృషి చేయాలని ఉపాధి హామీ సిబ్బందికి ఎంపిడిఒ అల్లా బకాష్ సూచించారు. శనివారం మండల కార్యాలయంలో ఏపీవో జుబేర్ అహ్మద్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధి కూలీలకు ఇబ్బందులు కలుగకుండా ఉదయం 6 గంటలకే పనులకు వెళ్లేలా చూసుకోవాలని ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. గ్రామాల్లో వలసలు వెళ్లకుండా పనులు కల్పించే బాధ్యత సిబ్బందిపై ఉందని తెలిపారు. ఫారంపాండ్స్ పనులను చేపట్టాలన్నారు. మండలంలో ఉపాధి కూలీల శాతం రోజురోజుకు పెరగాలన్నారు. వేతనాలు వచ్చేవారం ఉపాధి కూలీల ఖాతాలకు జమవుతాయని తెలిపారు. మినీ గోకులం షెడ్లు నిర్మించుకునే వారందరూ త్వరగా పూర్తి చేసుకుంటే సకాలంలో నిధులు మంజూరయ్యేలా చూడాలని ఏపీవోకు సూచించారు. పరిపాలన అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ అల్లా బకాష్

ప్రజాసమస్యలు ప్రభుత్వానికి పట్టవా..?

- డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న

ప్రజాశక్తి - కౌతాళం

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వానికి పట్టవా అని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న ప్రశ్నించారు. శనివారం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా పెద్దకడబూరు మండలం పెద్దకడబూరు, నౌలేకల్ గ్రామాల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని తెలిపారు. తాగునీరు, సరైన డ్రెయినేజీ, రోడ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మిరప రైతులకు గిట్టుబాటు ధర లేక అప్పుల పాలవుతున్నా ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ఈ ప్రాంత ప్రజలు ఉపాధి లేక బతుకుదెరువు కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లి మృత్యువాత పడుతున్నారని తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్యం లోపించి డెంగీ, మలేరియా వంటి వ్యాధుల బారిన పడుతున్నారని చెప్పారు. డివైఎఫ్ఐ మండల కార్యదర్శి దేవదాసు, అధ్యక్షులు రాజేంద్ర, సిఐటియు నాయకులు ఈరన్న, డివైఎఫ్ఐ నాయకులు నరసింహులు, నాగిరెడ్డి, ఆశీర్వాదం, శంకర్, రవి, నారాయణ పాల్గొన్నారు.



పెద్దకడబూరులో మాట్లాడుతున్న రామన్న

షేర్‌ఖాన్ కొట్టాల వాసులకు ఇంటి పట్టాలివ్వాలి

ఆదోని పట్టణంలో చాలా ఏళ్లుగా నివాసముంటున్న షేర్ ఖాన్ కొట్టాల వాసులకు ఇంటి పట్టాలివ్వాలని సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, పట్టణ కార్యదర్శి వర్గసభ్యులు తిప్పన్న, నాయకులు వీరేష్ డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ నగర్, కౌడల్ పేట వార్డుల్లోని షేర్‌ఖాన్ కొట్టాల కాలనీలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాలనీ వాసులు చాలా ఏళ్ల నుంచి నివాసం ఉంటున్నా ప్రభుత్వం ఇళ్లపట్టాలు మంజూరు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. కాలనీలో వీధిలైట్లు వెలగడం లేదని, మురుగు కాలువలు లేక పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని తెలిపారు. కనీస సదుపాయాలు కల్పించాలని, కాలనీ సమస్యలు పరిష్కరించాలని గతంలో అధికారులను కోరినా పట్టించుకోలేదని చెప్పారు. కూటమి ప్రభుత్వం షేర్‌ఖాన్ కొట్టాల వాసులకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. నాయకులు శివ, ఈరన్న, బాషా, ఈరప్ప ఉన్నారు.



ఆదోనిలో సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

లక్ష్యాన్ని అధిగమించిన మార్కెట్

- మార్కెట్ యార్డు కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్



ఈఏడాది లక్ష్యాన్ని అధిగమించినట్లు ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2024-25 సంవత్సర మార్కెటింగ్ శాఖ రూ.17.10 కోట్లు కేటాయించగా మార్చి 15 నాటికి రూ.17.15 కోట్ల లక్ష్యం చేరినట్లు తెలిపారు. ఈ ఏడాది లక్ష్యానికి కన్నా రూ.5 లక్షలకు పైగా ఆదాయం చేకూరిందని చెప్పారు. ఈ లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి సహాయ, సహకారాలతో పాటు మార్కెట్ యార్డు అసిస్టెంట్ కార్యదర్శి శాంత కుమార్, కార్యాలయ సిబ్బంది సహాయ సహకారాలు దోహదపడ్డాయని తెలిపారు. మార్కెట్ యార్డును అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తామన్నారు. మొండి బకాయిలను వదిలి పెట్టే ప్రసక్తే లేదని, వారికి నోటీసులు కూడా జారీ చేస్తామని తెలిపారు.

ఉరుసుకు రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఆహ్వాన పత్రిక అందిస్తున్న పీఠాధిపతులు

ప్రజాశక్తి - కౌతాళం

కర్ణాటక రాష్ట్రం సేడం తాలూకాలోని మల్కేడ్ దర్గాలో జరగనున్న ఉరుసు మహోత్సవానికి ముఖ్య అతిథిగా రావాలని దర్గా పీఠాధిపతులు సయ్యద్ షా ముస్తాఫా ఖాద్రీ ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని ఆహ్వానించారు. శనివారం ఎమ్మెల్యే స్వగ్రామమైన రాంపురంలో ఆయనను కలిసి ఆహ్వాన పత్రిక అందించారు. ఈ సందర్భంగా పీఠాధిపతులకు ఎమ్మెల్యే శాలువా, పూలమాల వేసి సన్మానించి, ఉరుసుకు తప్పకుండా హాజరవుతామని తెలిపారు. వైసిపి కోసిగి మండల ఇన్‌ఛార్జ్ మురళీ రెడ్డి ఉన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి : ఎస్ఎఫ్ఐ

- ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, హాస్టల్ వార్డెన్ సిద్ధప్ప ఆకాంక్షించారు. శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదోని పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర-1, వసతి గృహం పదో తరగతి విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లలను, పరీక్షా కిట్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులు బాగా చదివి ఉత్తమ మార్కులు సాధిస్తే తల్లిదండ్రులకు, పాఠశాలతో పాటు గ్రామానికి మంచి పేరు వస్తుందని తెలిపారు. ఇప్పుడు కష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. కేంద్రాల దగ్గర ఎలాంటి సమస్య వచ్చినా ఎస్ఎఫ్ఐ నాయకులకు తెలపాలని అన్నారు. సంక్షేమ బాలుర, వసతి గృహం వార్డెన్ నాగమద్దయ్య, ఎస్ఎఫ్ఐ నాయకులు సంజయ్, నరసింహ, ఉమాకాంత్, బాష, వెంకట్ పాల్గొన్నారు.



మెటీరియల్ ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

తాగునీటి సమస్యను పరిష్కరించండి

- టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్‌ను కోరిన టిడిపి నాయకులు అంజి యాదవ్

ప్రజాశక్తి - చిప్పగిరి



వినతిపత్రం అందజేస్తున్న అంజి యాదవ్, ప్రజలు

వేసవి కావడంతో తాగునీటికి చాలా ఇబ్బందులు పడుతున్నామని, తాగునీటి సమస్య నుంచి నగరడోన గ్రామస్తులను కాపాడాలని టిడిపి నాయకులు అంజి యాదవ్ కోరారు. శనివారం టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 20 రోజులకోసారి అయినా తాగునీరు రావడం లేదని, పరిష్కారం చూపాలని కోరారు. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూసుకోవడానికి ప్రభుత్వం అధిక నిధులు వెచ్చిస్తోందని, కొంతమంది అధికారుల అలసత్వంతో సకాలంలో తాగునీటి సమస్యకు పరిష్కారం చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు సమాచారం అందించి తాగునీటి సమస్య లేకుండా చూడాలని కోరారు.

తూనికలు, కొలతల శాఖాధికారులు

పెట్రోల్ నాణ్యతను నిర్ధారిస్తారా..?

- పెట్రోల్ కల్తీ వ్యవహార విచారణలో అడుగడుగునా అనుమానం

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరులోని బళ్లారి రోడ్డులో ఉన్న లక్ష్మి నారాయణ పెట్రోల్ బంకులో జరిగిన పెట్రోల్ కల్తీ వ్యవహారం విచారణలో అడుగడుగునా అనుమానాలకు తావిస్తోంది. పెట్రోల్ నాణ్యతను తూనికలు, కొలతల శాఖ అధికారులు, తహశీల్దార్ గోవింద్ సింగ్ నిర్ధారించడం విస్మయానికి గురి చేసింది. పెట్రోల్‌కు సంబంధించిన టెక్నికల్ అధికారులు నాణ్యతను నిర్ధారించాల్సి ఉండగా తూనికలు, కొలతల అధికారులతో తూతూమంత్రంగా నిర్వహించడం గమనార్హం.

బైక్ వాహన దారుడు వై.హెచ్.ఈరన్న కల్తీ పెట్రోల్‌పై శుక్రవారం రాత్రి తహశీల్దార్ గోవింద్ సింగ్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేసి శ్యాంపిల్ పెట్రోల్‌ను పోలీసు స్టేషన్‌లో భద్రపరిచారు. శనివారం ఆలూరు సిఎస్‌డిటి దీప, ఆర్ఐ బసవన్న గౌడ్ ఆధ్వర్యంలో తూనికలు, కొలతల (లీగల్ మెట్రాలజీ) ఇన్‌స్పెక్టర్ సిబ్బంది వచ్చి తూనికలు, కొలతల నిర్ధారించగా, బాధితుడు, స్థానికులు కొలతలపై ఫిర్యాదు చేయలేదని, కల్తీ పెట్రోల్‌పై ఫిర్యాదు చేశామని చెప్పారు. నాణ్యత తమకు సంబంధం లేదని అధికారులు చెప్పినా తూనికలు, కొలతల అధికారులు సిఎస్‌డిటి, తహశీల్దార్‌తో మాట్లాడి సేల్స్ ఆఫీసర్‌ను పిలిపించి నిర్ధారణ చేయమని ఆదేశాలు ఇచ్చారు. ఈ తతంగమంతా గమనిస్తున్న ఓ ప్రయివేట్ వ్యక్తి మధ్యాహ్నం తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహశీల్దార్‌తో మంతనాలు జరిపినట్లు అనుమానాలకు తావిచ్చింది. అనంతరం తహశీల్దార్ పెట్రోల్ బంకుకు వచ్చి పోలీసు స్టేషన్‌లో ఉన్న శ్యాంపిల్ పెట్రోల్‌ను తెప్పించి ఉదయం తూనికలు, కొలతల అధికారులు ఏదైతే చేపట్టారో తహశీల్దార్ సమక్షంలో అలాగే చేయడం వల్ల పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఉదయం తీసుకున్న నివేదిక, మధ్యాహ్నం తర్వాత తీసుకున్న నివేదిక డిఎస్ఒకు పంపిస్తానని తహశీల్దార్ గోవింద్ సింగ్ చెప్పారు. ఈ విచారణలో ప్రయివేట్ వ్యక్తిని మీడియా విచారించగా... పేరు చంద్రశేఖర్ అని, సేల్స్ ఆఫీసర్ పంపించారని తెలపడం అనుమానాలకు దారి తీసింది.



పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు

పెట్రోల్ బంకులపై పర్యవేక్షణ లోపమే

- పి.హనుమంతు, సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి

లక్ష్మి నారాయణ పెట్రోల్ బంకులో గతంలో నుంచి కల్తీ వ్యవహారంపై ఫిర్యాదులు వస్తున్నా అధికారుల పర్యవేక్షించడం లేదు. కల్తీపై విచారణ చేయమంటే తూనికలు, కొలతలపై విచారించడం అనుమానాలకు దారి తీస్తోంది. పెట్రోల్ బంకులో వినియోగదారులకు తాగు నీరు, మురుగుదొడ్లు, వాహనాలకు గాలి మిషన్లు, పెట్రోల్, డీజిల్ వేయించుకున్న తర్వాత బిల్లులు ఇవ్వడం లాంటి మౌలిక వసతులు కల్పించకపోవడం వినియోగదారులను మోసం చేయడమే.

ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు

- ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు కీర

ప్రజాశక్తి - ఆదోని



పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్స్ సమస్యలపై అసెంబ్లీలో స్పందించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎన్.కీర తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ, సమగ్ర శిక్షలో పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్స్ ఆర్ట్, వర్క్, హెల్త్ ఎడ్యుకేషన్‌లుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సమస్యలపై అసెంబ్లీలో రాజమండ్రి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడిన తీరు హర్షించదగ్గదని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా తమ సమస్యలు, పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్స్ అనే పదం తీసి ఫుల్ టైం ఒకేషనల్ టీచర్స్‌గా మార్చాలని, ఉద్యోగ భద్రత కల్పించి, మినిమం టైం స్కేల్ అమలు చేయాలని అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వానికి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి వెళ్లడం వల్ల తమకు నమ్మకం కలుగుతోందని చెప్పారు. సమగ్రశిక్ష పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్స్‌కు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు.

వైసిపి మైనారిటీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా మాబుసాబ్

ప్రజాశక్తి - కౌతాళం



వైసిపి మైనార్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా మాబు సాబ్ ఎన్నిక కావడం పట్ల వైసిపి మండల నాయకులు శనివారం హర్షం వ్యక్తం చేశారు. కౌతాళం మండలం, ప్రస్తుత కోఆప్షన్ సభ్యులు మాబు సాబ్ రాష్ట్ర కమిటీకి ఎన్నిక కావడం పట్ల వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి, ఎంపిపి అమ్రేష్, వైసిపి బుజ్జి స్వామి, సర్పంచి పాల్ దినకరన్ మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం కష్టపడే వారిని రాష్ట్ర నాయకత్వం గుర్తించడానికి ఇదే నిదర్శనమని తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత

- 12 బాక్సులు స్వాధీనం

ప్రజాశక్తి - ఆస్పరి

కర్ణాటక మద్యం పట్టుకున్నట్లు సిఐ మస్తాన్ వలీ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. హాలహర్వి మండలం బిలేహాల్ గ్రామానికి చెందిన మహేంద్ర ద్విచక్ర వాహనంపై 12 కర్ణాటక మద్యం బాక్సులు తుగ్గలి మండలంలో సరఫరా చేయడానికి తీసుకెళ్తుండగా ఆస్పరిలోని పత్తికొండ రోడ్డులో ఉన్న భారత్ పెట్రోల్ బంకు దగ్గర పట్టుకున్నామన్నారు. ఒక్కో బాక్సులో 96 టెట్రా ప్యాకెట్లు ఉన్నాయని, ఒక ప్యాకెట్ రూ.40 చొప్పున వీటి విలువ రూ.46,080 ఉంటుందని తెలిపారు. కర్ణాటక టెట్రా ప్యాకెట్లు ఎవరైనా సరఫరా చేసినా, అమ్మినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మంత్రాలయం చేరుకున్న పాదయాత్రికులు

ప్రజాశక్తి - కౌతాళం

మంత్రాలయంలోని రాఘవేంద్రస్వామి దర్శనార్థమై చెన్నై నుంచి పాదయాత్ర ద్వారా భక్తులు శనివారం మంత్రాలయం చేరుకున్నారు. మార్చి 1న తమిళనాడు రాజధాని చెన్నై నుంచి అమ్మన్ సత్యనారాయణ, వెంకటేష్, సురేష్, మోహన్ సుందరం, ప్రేమనాథ్, రాజా తదితరులు పాదయాత్ర మొదలు పెట్టారు. మండుతున్న ఎండకు సుమారు 15 రోజుల పాటు సాగిన పాదయాత్ర శనివారం మంత్రాలయం చేరుకుంది.

ప్లాస్టిక్ నిర్మూలనతో పర్యావరణ పరిరక్షణ

- మున్సిపల్ చైర్మన్ శాంత - ఘనంగా స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర దివస్

ప్రజాశక్తి - ఆదోని

ప్లాస్టిక్ వాడకం మానుకొని ఆదోనిని ప్లాస్టిక్ రహిత పట్టణంగా మారుద్దామని, ప్లాస్టిక్ నిర్మూలనతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని మున్సిపల్ చైర్మన్ శాంత, కమిషనర్ కృష్ణ తెలిపారు. శనివారం స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే ఇబ్బందులను ప్రజలకు వివరిస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. శ్రీనివాస భవన్ నుంచి పెద్ద మసీదు, భీమాస్ కూడలి వరకు 'ప్లాస్టిక్ వాడకం వద్దు' అంటూ నినాదాలు చేస్తూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ కవర్లు కాకుండా బట్ట సంచులు వాడాలన్నారు. నిబంధనకు విరుద్ధంగా ప్లాస్టిక్‌ను గోడౌన్‌లో దాచి విక్రయిస్తే చట్టరీత్యా నేరమని తెలిపారు. ప్లాస్టిక్ వాడకం రోజురోజుకు పెరుగుతోందని, ఈ వ్యర్థాలు భూమిలో త్వరగా పాడవకుండా ఎక్కువ రోజులు నిల్వ ఉండడం వల్ల రసాయనాలు చేరి అంతర్భాగం కలుషితమయ్యే ప్రమాదం ఉందని చెప్పారు. ఇప్పటికే క్యాన్సర్ వ్యాధి ఆందోళన కలిగిస్తోందని, ప్లాస్టిక్ వాడకం వల్ల కూడా ఆరోగ్యాలపై ప్రభావం చూపుతోందని శాస్త్రవేత్తలు చెబుతున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడే దిశగా ప్లాస్టిక్ వాడకం మానుకొని సహకరించాలని కోరారు. అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రంజిత్, ఉద్యోగులు కృష్ణ, రవి, నరసింహులు, తిక్కస్వామి, మెప్మా సిఒ జావీద్, శానిటేషన్ సెక్రటరీలు శివ, వెంకప్ప ఉన్నారు. **ఎమ్మిగనూరు** పట్టణంలో విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది, పొదుపు సభ్యులు ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి మాట్లాడుతూ... ప్లాస్టిక్ వినియోగం వల్ల అనేక అనర్థాలు ఉన్నాయని తెలిపారు. వేడివేడి పదార్థాలను హోటళ్లు, రెస్టారెంట్ల నుంచి పార్శిల్ తీసుకెళ్లేటప్పుడు ఒకసారి వినియోగించే ప్లాస్టిక్‌ను ఉపయోగించడం వల్ల మానవ శరీరంలోకి ప్రత్యక్షంగా చేరుతుందని, దీనివలన క్యాన్సర్, గ్యాస్ వంటి రోగాలు సంభవిస్తాయని చెప్పారు. పబ్లిక్ హెల్త్ డిఇ రాజు నాయక్ , డిఇ నీరజ, శరత్ చంద్ర, ఎఇ మదన్ కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, చాంద్ బాష, రామకృష్ణ, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ రాజేష్, స్రుహులత, ఉరుకుందమ్మ, రంజిత్ కుమార్, షేక్షావలీ, జయవర్ధన్ పాల్గొన్నారు. **చిప్పగిరిలో** పంచాయతీ కార్యదర్శి ప్రమీల, నేమకల్లులో ఇఒఆర్‌డి బాలన్న, ఆస్పత్రిలో డాక్టర్ అఫ్రోజ్ జహాన్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు వివరించి అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించారు. చిప్పగిరి సచివాలయం నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎంపిడిఒ అల్లా బకాష్, ఎంపిటిసి రజిని, మాజీ ఎంపిటిసి భాస్కర్, టిడిపి నాయకులు జనార్ధన స్వామి, భోగేశ్వర స్వామి, సిహెచ్ఒ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. **దేవనకొండలో** మేజర్ పంచాయతీ కార్యదర్శి రఫీ, సర్పంచి రంగలక్ష్మీ భర్త బండ్లయ్య ఆధ్వర్యంలో స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ప్లాస్టిక్ నిషేధంపై, పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహించారు. బస్ స్టేషన్ ప్రాంగణంలో స్వచ్ఛభారత్‌పై ప్రతిజ్ఞ చేశారు. **కౌతాళం :** మంత్రాలయంలో పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛ మంత్రాలయం నిర్మాణంలో భాగస్వామ్యులు కావాలని ఎంటిఆర్ వరుసలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్వాహకులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. సర్పంచి, వైసిపి మండల ఉపాధ్యక్షులు తెల్లబండ్ల భీమయ్య, గ్రామ కార్యదర్శి నాగరాజు, సచివాలయ ఉద్యోగులు, వెల్ఫేర్ అసిస్టెంట్ అనిత, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శివ, ఉపాధి టిఎ కృష్ణ పాల్గొన్నారు. **కౌతాళం** పంచాయతీ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ సర్కిల్‌లో ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించి, అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. ఎంపిడిఒ సత్యన్న, ఇఒఆర్‌డి యోగేశ్వర్ రెడ్డి, సర్పంచి పాల్ దినకరన్ మాట్లాడారు.

కౌతాళం : పెద్దకడబూరులో ఎంపిడిఒ నాగరాజు స్వామి, ఇఒఆర్‌డి జయరాముడు ఆధ్వర్యంలో సర్పంచి రామాంజనేయులు అధ్యక్షతన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర నిర్వహించారు. టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జీ రాఘవేంద్రరెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి, మండల అధ్యక్షులు బసలదొడ్డి ఈరన్న ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అనంతరం స్వచ్ఛ భారత్‌పై ప్రతిజ్ఞ చేయించారు. ప్లాస్టిక్ రహిత సంచులను పంపిణీ చేశారు. అలాగే బస్టాండ్ ఆవరణలో చీపురు పట్టి చెత్తాచెదారాన్ని తొలగించారు. ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు ఏసేపు, నాయకులు మల్లికార్జున, విజయ్ కుమార్, తలారి అంజి, మొత్రు రామాంజనేయులు, చిన్నకడబూరు గోనుమాను నరసన్న, కలుగొట్ల లక్ష్మన్న, చిన్నతుంబళం వీరేష్ గౌడ్, చంద్ర, నరసప్ప, జాలవాడి ముక్కన్న, కంబగిరి, కంబదహాళ్ మునెప్ప, హెచ్.మురవణి సొంటెన్న, హనుమాపురం బిపి.ఈరన్న, రాగిమాన్ దొడ్డి వెంకటరెడ్డి, రాముడు, మొత్రు ఈరన్న, మొత్రు నరసింహులు, లక్ష్మీకాంతరెడ్డి, అయ్యప్ప, మధు, నరసింహులు, రాజు, తిక్కయ్య పాల్గొన్నారు.



ఆదోనిలో ర్యాలీ నిర్వహిస్తున్న చైర్మన్ శాంత, కమిషనర్ కృష్ణ



ఎమ్మిగనూరులో అవగాహన కల్పిస్తున్న కమిషనర్ గంగిరెడ్డి



పెద్దకడబూరులో అవగాహన కల్పిస్తున్న రాఘవేంద్రారెడ్డి



దేవనకొండలో ప్రతిజ్ఞ చేస్తున్న పంచాయతీ సిబ్బంది



మంత్రాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న పంచాయతీ సిబ్బంది



చిప్పగిరిలో



కౌతాళంలో

అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థకు ఏర్పాట్లు

- సర్పంచి తెల్లబండ్ల భీమయ్య

ప్రజాశక్తి - కౌతాళం



స్థలాన్ని పరిశీలిస్తున్న సర్పంచి భీమయ్య

మంత్రాలయంలోని రామచంద్రనగర్ కాలనీలోని సెల్ టవర్ ఏరియాలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటుకు శ్రీకారం చుట్టినట్లు సర్పంచి తెల్లబండ్ల భీమయ్య తెలిపారు. శనివారం ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వెంకటరాముడుతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, రాంపురం రెడ్డి సోదరుల ఆదేశాల మేరకు, ఎంపిపి గిరిజమ్మ సూచన మేరకు మండల గ్రాంట్ కింద రూ.17 లక్షలతో అడుగు ఎత్తు పైపులతో 500 మీటర్ల మేర డ్రెయినేజీ వ్యవస్థకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. త్వరలో రాంపురం రెడ్డి సోదరులు భూమి పూజ చేస్తారని, అనంతరం పనులు మొదలు పెడతామని చెప్పారు.

అనారోగ్యంతో చిన్నహరివాణం విఆర్ఎ మృతి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్



మాట్లాడుతున్న ఆర్ఐ ఖాసీం

మండలంలోని చిన్న హరివాణం విఆర్ఎ మూకప్ప శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. మూకప్ప మృతిపై తహశీల్దార్ శివరాముడు సంతాపం వ్యక్తం చేశారు. మూకప్ప మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. మట్టి ఖర్చులకు రూ.25 వేలు అందించారు. మూకప్పకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆర్ఐ ఖాసీం, విఆర్ఒలు శ్రీనివాసులు, చిన్న ఈరన్న, విఆర్ఎల సంఘం జిల్లా నాయకులు వెంకటేశులు, డివిజన్ అధ్యక్షులు సోలా శ్రీనివాసులు, మండల అధ్యక్షులు వీరేష్, హనుమంతు, జిల్లా నాయకులు గాదిలింగ, పరమేష్, నరసప్ప, కిష్టప్ప, ఈరన్న పాల్గొన్నారు.

'చిరు వ్యాపారులను ఇబ్బంది పెట్టొద్దు'

ప్రజాశక్తి - ఆదోని

రంజాన్, ఉగాది పండగలు ముగిసే వరకు ఆదోనిలో ఫుట్‌పాత్ కూల్చివేతను నిలిపివేయాలని, చిరు వ్యాపారులను ఇబ్బంది పెట్టవద్దని సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డిపిఐ) ఆదోని అసెంబ్లీ కో కన్వీనర్ సద్దాం హుస్సేన్ కోరారు. శనివారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదోనిలో ఫుట్‌పాత్ కూల్చివేతకు తాము వ్యతిరేకం కాదని, దీనివల్ల ఉపాధి కోల్పోయి చిరు వ్యాపారులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జీవనోపాధి కోసం ఫుట్‌పాత్‌పై ఆధారపడిన వారికి ఇబ్బందులు కలిగిస్తోందన్నారు. కూల్చిన ఇటుకలు, సిమెంటు దిమ్మెలు రోడ్డుపై అడ్డదిడ్డంగా వేయడం వల్ల షాహి జామియా మసీదు, లక్ష్మమ్మవ్వ దేవాలయానికి వచ్చే భక్తులకు ఇబ్బంది కలుగుతోందని తెలిపారు. ఉగాది, రంజాన్ పండగలు ముగిసే వరకు కూల్చివేత పనులను నిలిపివేయాలని కోరారు. మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు.